క్లుప్తంగా

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


గడిగరేవులలో వృద్ధురాలు బాలనరసమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీరు ఆదిలక్ష్మి

గడివేముల: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. రెండోరోజు సోమవారం వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. చెంతకే వచ్చి పెన్షన్‌కానుక ఇస్తుండటంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.మరో రెండురోజుల్లో మండలంలో వందశాతం పెన్షన్ పంపిణీ పూర్తవుతుందని అధికారులుత తెలిపారు.

'సుంకేసుల'కు 3,950 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి సోమవారం 3,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యామ్‌కు ఒక గేట్‌ను అర మీటరు మేర ఎత్తి 2,264 క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేసీ కాల్వకు 1,616 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా పెద్దస్వామి


ప్రశంసా పత్రం అందుకుంటున్న పెద్దస్వామి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పెద్దస్వామి వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా నియమితులైనట్లు ఇంపాక్టు ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించిన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ తరగతులను పెద్దస్వామి విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామచంద్రుడు, మాధురి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు. పెద్దస్వామి నియామకంపై తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ


మరియమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: సి.బెళగల్ మండల కేంద్రానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్త సురేష్ సతీమణి మరియమ్మ సోమవారం అనారోగ్యంతో పెద్దాసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ హాస్పటల్‌కి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కోటబావిలో పూడికతీత

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కోటబావిలో యువకులు మోహన్, హర్ష, శరత్‌తో పాటు పలువురు సోమవారం పూడికతీత పనులు చేపట్టారు. గ్రామానికి మధ్యలో ఉన్న పురాతన బావిలో చెత్త చెదారం పేరుకుపోయింది. యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి చెత్తను తీసి, బావిని శుభ్రపరిచారు. చుట్టుపక్కల నివాసాల ప్రజలు చెత్తను బావిలో వేయరాదని యువకులు సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బేతంచెర్ల: తాగునీటి సమస్య పరిష్కరించాలని మండల పరిధిలోని అంబాపురం ఎస్సీ కాలనీ వాసులు సూర్యనారాయణ, మహేష్,కాశీ, రామ మద్దిలేటి, మధు నాగేంద్ర, వెంకట్రాముడు, పెద్ద మద్దయ్య కోరారు. కాలనీలో 15 రోజులుగా నీరు, వీధిలైట్ల సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఇదే విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వెలసిన శైవ పుణ్యక్షేత్రం ముచ్చట్ల బ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో భాద్రపద సోమవారం పూజలు నిర్వహించారు. వేదపండితులు నరేష్ శర్మ, అర్చకుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో భక్తులు బ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. బుగ్గానిపల్లె గ్రామ సమపంలో వెలసిన బ్రహ్మ సూత్ర సహిత నాగలింగేశ్వర స్వామి ఆలయంలోనూ ధర్మకర్త చిన్ని శేషఫణి ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు.

మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

● గూడూరులో..


గూడూరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, తదితరులు

గూడూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జే.ఆబేల్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, కౌన్సిలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి తహసీల్దార్ వెంకటరమణ పూల మాల వేసి ఆయన సేవలు కొనియాడారు.


గూడూరులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ వెంకటరమణ



సి.బెళగల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో గాంధీ జయంతి నిర్వహిస్తున్న ఎస్‌ఐ

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

సి.బెళగల్: మహాత్మాగాంధీ అడుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సూచించారు. సోమవారం గాంధీ జయంతి సందర్బంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలోని గాంధీ విగ్రహానికి ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోనుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పీరయ్య గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు వీరన్న గౌడ్ పాల్గొన్నారు.

● చనుగొండ్లలో..

గూడూరు రూరల్: గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ సునీత సూచించారు. చనుగొండ్లలోని సచివాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

● గాంధీ కలు సాకారం

పాణ్యం: స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ చిత్ర పటానికి ప్రజాప్రతినిధుల, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ దస్తగిరి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** మండల పరిధిలోని దూపాడు సమీపంలో ఉన్న కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గాంధీ జయంతి వేడుకులు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరై గాంధీ చిత్ర పట్టానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● కల్లూరు బీజేపీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్బంగా ఆయన చిత్ర పట్టానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు చెన్నయ్య, నాయకులు జీఎస్ నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● **గడివేముల:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని గాంధీజీ విగ్రహానికి ఉపసర్పంచ్ బాలచెన్ని, చాయతీ కార్యదర్శి రంగడు పూలమాలలు వేసి నివాళుర్పించారు. బిలకలగూడూరు సచివాలయంలో సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి షభానా, గని సచివాలయంలో సర్పంచ్ కత్తి తులషమ్మ, ఉపసర్పంచ్ శివానందరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మలు గాంధీజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, దుర్వేశి సర్పంచ్ మండ్ల మమత ఆధ్వర్యంలో గాంధీజీ వేడుకలు ఘనంగా జరిగాయి.

● గాంధీ మార్గం అనుసరణీయం

కల్లూరు: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అనుసరనీయమని కల్లూరు తహసీల్దార్ టీవీ రమేష్ బాబు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. మహాత్ముడి చిత్ర పట్టానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

● భావితరాలకు స్ఫూర్తిప్రదాత


కోడుమూరులో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

కోడుమూరు రూరల్: గాంధీ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. మహాత్మగాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ గాడిరూతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మేజర్ పంచాయతీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి సర్పంచు భాగ్యరత్న పూలమాల వేసి నివాళులర్పించారు.

● పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మొక్కకు నీరుపోస్తున్న నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి

కల్లూరు: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నాబార్డ్ డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని చిన్నటేకూరు గ్రామ సచివాలయం ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిసరాలల్లో పిచ్చి మొక్కలను తొలగించారు. మొక్కలు నాటి నీళపోశారు. శుభ్రత, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సోమన్న, గ్రామ నాయకులు ఈశ్వరయ్య, నారాయణ, అపార్డ్ సంస్థ సభ్యులు వెంకటరెడ్డి, వివిధ సేవాసంస్థలు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




చనుగొండ్లలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ సునీత , పాణ్యంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గడివేములలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

● డీపీఓ నాగరాజు నాయుడు
● నెరవాడ గ్రామ సభకు హాజరైన అధికారులు


మాట్లాడుతున్న డీపీఓ నాగరాజు నాయుడు

కల్లూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు అన్నారు. నెరవాడ గ్రామంలో సర్పంచ్ మదన్‌గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారితో పాటు డీఎల్‌పీఓ తిమ్మక్క హాజరయ్యారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామంలో జరిగిన ఆర్థికేతర అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. బాలికా విద్య ప్రాముఖ్యతను వివరించి ప్రతి ఇంట్లో బాలికలు చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్యంలో వివాహం చేయడంలో మానసికంగా, శరీరకంగా అనేక సమస్యలు ఉత్పనమవుతయన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించి, గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం క్లాప్ మిత్ర (పారిశుద్య కార్మికుడు) సేవలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవి కిషోర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

– చిన్నటేకూరులో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి హాజర్యయ్యారు. ముందుగా జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్బంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మన్న, ఎంపీటీసీ సోమన్న, పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి..

పాణ్యం: గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. సోమవారం గోనవరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయభాస్కర్, శేఖర్, గ్రామ కార్యదర్శి నాగమణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి

గోనవరం గ్రామంలో నేడు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఎంపీడీఓ దస్తగిరి కోరారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


సచివాలయం - 2 శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం-2, రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్బీకే – 2 భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు ప్రజల వద్దకే చేరుతున్నాయన్నారు. ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్ష టీడీపీ, జన సేన నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఎస్ఎం బాషా, సంగాల, కొత్తకోట సర్పంచ్‌లు హనుమంతు, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్న కొండయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ పాల్గొన్నారు.

భవనం పైనుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన రాజేష్

రాజంపేట: పట్టణంలోని మన్నూరు తోట కల్యాణ మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనంపై నుంచి సోమవారం ఓ యువకుడు కింద పడి దుర్మరణం చెందాడు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం ఆర్.మండగిరికి చెందిన మద్దగిరి రాజేష్ (31) ఇక్కడికి వలస కూలీగా వచ్చి పనులు చేసుకునేవాడు. సోమవారం పని చేస్తుండగా భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఆరు నెలల గర్భవతి. అలాగే వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ వ్యవహారం మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరింది. కేసు నమోదు విషయంలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయని బాధిత వర్గాలు పేర్కొన్నాయి.

వృద్ధాశ్రమానికి అనాథ మహిళ


ఆశ్రమంలో చేర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: మండల పరిధిలోని ఎద్దుపెంట గ్రామంలో వృద్ధురాలు లక్ష్మీదేవికి నా అనే వారు ఎవరూ లేక పోవడం, నిలువ నీడలేక, తినడానికి తిండి లేక ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకునేది. స్ఫూర్తి సేవా సమితి సభ్యుల సహకారంతో గ్రామస్తులు వైఎస్సార్ కడప జిల్లా యర్రగుంట్ల గ్రామంలో ఉన్న శ్రీ ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వం చాటుకున్నారు.గ్రామస్తులు పులికేశవయ్య, నాగరాజు, సాలమ్మ తదితరులు నిర్వాహకులను సంప్రదించి సోమవారం వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

● ఉప్పలపాడులో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


దివ్యాంగుడికి సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే ఎస్సీ కాలనీలో పర్యటించారు. అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న అవినీతి రహిత పాలన, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సుమారు 95 శాతం ఇప్పటికే అమలు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధి చేకూరిందన్నారు. గృహనిర్మాణం, పింఛన్లు, రైతు భరోసా, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా ఇలా అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ పథకాలు తిరిగి పొందాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల క్యాలెండర్లు అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు, తాగునీటి కోసం పైపులైన్లు నిర్మించాలని కాలనీవాసులు కోరగా గడప గడప కార్యక్రమం పూర్తయిన వెంటనే ఆ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, స్థానిక నాయకులు మధు, దస్తగిరి, రాఘవరెడ్డి, శివవకుమార్, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, సచివాలయ సిబ్బంధి, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

కోడుమూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును మంగళవారం స్థానిక సచివాలయం-2 పరిధిలోని సంతమార్కెట్ బాలికల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సి.బెళగల్‌లో ..

సి.బెళగల్: మండల కేంద్రంలోని సచివాలయం – 1 ఆవరణంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి తెలిపారు. ప్రజలు శిబిరాన్ని ఉపయోగించుకుని వైద్య సేవలు పొందాలన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష క్యాంపు

గడివేముల: మండల కేంద్రం గడివేముల జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, డాక్టర్ మొల్లా జబీన్ తెలిపారు. దీనిని గ్రామస్తు లు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సారా విక్రేతల అరెస్టు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి వట్టిగింజల స్వాములు, తిరుపాడు గ్రామానికి చెందిన గోగుల సురేష్ బాబు నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండు విధించినట్లు వెల్లడించారు.

సబ్సిడీ శనగ విత్తనాలకు నేటి నుంచి పేర్ల నమోదు

కోవెలకుంట్ల: సబ్సిడీ శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ నిరంజన్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్ మొదటి పంటగా సాగు చేసిన పప్పుశనగ విత్తనాలను ప్రభుత్వం 40 శాతం రాయితీతో సరఫరా చేస్తోందన్నారు. సబ్సిడీ పోనూ క్వింటాకు రూ.4,860 చెల్లించాలన్నారు. ఎకరాకు రెండు ప్యాకెట్ల(40 కిలోలు) చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాల వరకు రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు.

పోలీసు స్టేషన్ చేరిన పోతురాజు ఆలయ సమస్య


సీఐ కార్యాలయం వద్ద చెరువుపల్లె గ్రామస్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని గోవిందిన్నె గ్రామ సమీపంలో ఉన్న చెరుపల్లె గ్రామానికి చెందిన పోతురాజు ఆలయ సమస్య పోలీస్ స్టేషన్ చేరింది. 300 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని గత టీడీపీ పాలనలో జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ యజమాన్యం తొలగించింది. దీంతో ఆలయాన్ని పునర్నించాలని చెరువుపల గ్రామస్తులు కోరుతూ వస్తున్నారు. రెండు రోజుల క్రితం నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్పందించి యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాయాలని సీఐ తిమ్మారెడ్డికి సూచించారు. అందులో భాగంగా గ్రామస్తులు, పరిశ్రమ ప్రతినిధులు సోమవారం స్టేషన్‌కు వచ్చారు. ఆలయ పునర్నిర్మించేందుకు సంస్థ ప్రతినిధులు అంగీకరించారని, అయితే నిర్మించాల్సిన స్థలం విషయంలోనే భేదాభిప్రాయాలున్నాయని గ్రామస్తులు పుల్లయ్య, సూర్యనారాయణరెడ్డి తదితరులు తెలిపారు.

స్పోర్ట్స్

ముగిసిన రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు



రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన కర్నూలు బాలుర జట్టు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర జూనియర్ విభాగంలో నెల్లూరు జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టు విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల వ్యవస్థాపకులు కేవీ సుబ్బారెడ్డి, వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ బహుమతులు, కప్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. బాలుర విభాగంలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నెల్లూరు, కర్నూలు, అనంతపురం జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం, కర్నూలు, గుంటూరు జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు గుడిపల్లె సురేందర్, రామాంజనేయులు, విజయ్‌కుమార్, సౌత్ ఇండియా ఇంచార్జ్ నోయల్ , నాగరత్నమయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని నగర మేయర్ బీవై.రామయ్య, విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మేయర్ బీవై రామయ్య ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుందర రాజు, శిక్షకులు సుజన్‌కుమార్ పాల్గొన్నారు.